క్లుప్తంగా

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



మహాసభలో పాల్గొన్న స్టాలిన్

గాజువాక: వచ్చేనెల 10, 11 తేదీల్లో విశాఖలో నిర్వహించనున్న సీపీఐ జిల్లా 25వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర సమితి కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎ.జె.స్టాలిన్ కోరారు. సీపీఐ చినగంట్యాడ శాఖా మహాసభను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో కొనసాగించాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పెన్షన్‌లు మంజూరు చేయాలని, కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశాలపై మహాసభల్లో తీర్మానాలు చేస్తామన్నారు. అనంతరం చినగంట్యాడ శాఖా కార్యదర్శిగా జి.ఆనంద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, దొడ్డి మల్లేశ్వరరావు, అప్పారి విష్ణుమూర్తి, భాస్కరరావు, దానయ్య, అప్పారి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశునికి సహస్రనామార్చన



సహస్ర నామార్చనలో పాల్గొన్న భక్తులు

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో తిరుమలేశునికి విశేష పూజలు నిర్వహించారు. శనివారం మధ్యాహ్నం భక్తులకు దివ్యక్షేత్రంలో అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం విశేష పుష్పాలతో సహస్రనామార్చన, నక్షత్ర హారతులు, కుంభహారతి సమర్పించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. తిరుమల బాలాజీ దివ్యక్షేత్రం ట్రస్ట్ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం తులసిపూజ నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శనివారం నిర్వహించే తులసి పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ర్యాంకర్లకు అభినందన



విద్యార్థులతో చైతన్య యాజమాన్య ప్రతినిధులు, ప్రిన్సిపాళ్లు

ఉక్కునగరం: జేఈఈ మెయిన్స్–2025 ఫలితాల్లో గాజువాక జోన్ శ్రీచైతన్య విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. వివిధ కేటగిరీల్లో సీహెచ్ శాలినీ చౌదరికి 142 ర్యాంకు, వై. సత్యంకు 226 , ఎస్. హిమహావిల్‌కు 354 ర్యాంకు, జి. వెంకటశంకర్‌కు 839 ర్యాంకు, ఆర్. వంశీకృష్ణకు 1014 ర్యాంకు, బి. భార్గవ్‌కు 1548 ర్యాంకు, పి. తోరణ్ సాయికు 1713 ర్యాంకు, ఎం. కిరణ్‌సాయికు 1736 ర్యాంకు, సీహెచ్. మోనిష్‌కు 2296 ర్యాంకులు లభించాయి. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ డీన్లు కె. బంగారుబాబు, ఎస్. రఘుకుమార్, ఏజీఎం పి. శ్రీనివాసరావు, డీన్లు పి. నాగేశ్వరరావు, ఎస్. మురళీకృష్ణ తదితరులు విద్యార్థులను అభినందించారు.



నిరుపయోగంగా ఆర్టీసీ కాంప్లెక్స్

- కళ తప్పిన కూర్మన్నపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్
- ఒకే సర్వీసుకు పరిమితం
- మరుగుదొడ్లకు తాళాలు
- అధ్వానంగా పరిసరాలు
- హైవే పైనే ప్రయాణికుల నిరీక్షణ

హలో.. నేను గుర్తున్నానా..!




కాంప్లెక్స్ ఆవరణలో 111వి బస్సు

కూర్మన్నపాలెం: ఒక వైపు జాతీయ రహదారి.. మరో వైపు కూర్మన్నపాలెం కూడలికి ఆనుకొని ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మించారు. విశాఖ ఉక్కుకర్మాగారంతో పాటు దువ్వాడ రైల్వేస్టేషన్ ఇతర సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు, వారి కుటుంబాల రవాణా సౌకర్యం కోసం కాంప్లెక్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. స్థానిక ఎమ్మెల్యే గుడివాడ గురునాథరావు మంత్రిగా ఉండడంతో పనులు వేగవంతం చేశారు. 1992 జనవరి 24న ప్రారంభించారు. బస్సులు వచ్చిపోయేందుకు వీలుగా 6 ఫ్లాట్ ఫారాలతో పాటు సిబ్బందికి అనుకూలంగా కాంప్లెక్స్‌లోనే గదులు నిర్మించారు. అయితే ఈ కాంప్లెక్స్ నిర్వహణ మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. దూరప్రాంతాలకు వెళ్లే ప్రతి బస్సు కాంప్లెక్స్‌లోకి వెళ్లి ప్రయాణికులను ఎక్కించుకొని వెళ్లేవి. రానురాను దూరప్రాంతాలకు వెళ్లే బస్సులు కాంప్లెక్స్ ముఖం చూడడం మానేశాయి. దీంతో ప్రయాణికులు కూడా జాతీయ రహదారికి చేరుకొని అక్కడే నిరీక్షించి దూరప్రాంత సర్వీసులను అందుకుంటున్నారు. విజయవాడ,తిరుపతి, హైదరాబాద్, అమలాపురం, కర్నూలు,ఖమ్మం తదితర ప్రాంతాలకు వెళ్లాల్సినవారంతా జాతీయ రహదారిపైనే వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. విద్యార్థులు, ఇతర ఉద్యోగులకు పాసులు జారీచేయడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరడంతో తాళాలు వేశారు.

హలో... నా పేరు కూర్మన్నపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్.. 1992 జనవరి 24న నేను మీకు చేరువయ్యాను. నా చెంతకు వచ్చిన ప్రయాణికులకు నీడనిచ్చాను. వివిధ ప్రాంతాలకు సురక్షితంగా చేర్చాను. అలాంటి నన్ను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో అర్థం కావడం లేదు. జాతీయ రహదారితో పాటు వివిధ ప్రాంతాలకు చేరువలోనే ఉన్నాను... అయినా నా నుంచి దూరప్రాంత సర్వీసులను దూరం చేశారు. నాటి నుంచి ప్రయాణికులు ఎండైనా.. వానైనా ఇబ్బంది పడుతూ షెల్టర్లు, నడిరోడ్డుపై నిరీక్షిస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు కూడళ్లలో పడుతున్న అవస్థలు చూస్తే నాకు బాధేస్తుంది. కొంచెం మరమ్మతులు చేసి... బస్సులను లోపలికి అనుమతిస్తే సేవలందించడానికి సిద్ధంగా ఉన్నాను.

ఇట్లు
మీ కూర్మన్నపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్.



మూత పడ్డ మరుగుదొడ్లు

నిర్లక్ష్యమెందుకో..

ఎన్నో నిర్వాసిత కాలనీలు,వాణిజ్య సముదాయాలు, ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థలు ఉండడంతో కూర్మన్నపాలెం ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. వివిధ ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తారు. అయితే వారందరికీ బస్సు షెల్టర్సే దిక్కుకావడంతో అధికారుల తీరును తప్పుపడుతున్నారు. సమీపంలోనే రైల్వేస్టేషన్,పోలీసుస్టేషన్, విశాఖ ఉక్కుకర్మాగారం పైలాన్‌తో పాటు ప్రధాన ద్వారం నిత్యం కళకళ లాడే కూర్మన్నపాలెం జంక్షన్‌లో ఆర్టీసీ కాంప్లెక్స్ ఉండి కూడా ప్రయాణికులకు నిలువ నీడ కల్పించలేకపోతుంది.

ఒకే సర్వీసు రాక

విజయనగరం వెళ్తున్న 111వీ బస్సు మాత్రమే స్టీల్ సిటీ డిపో నుంచి బయలు దేరుతుండడంతో కాంప్లెక్స్‌లోకి వచ్చి వెళిపోతుంది.

కాంప్లెక్స్‌ఉన్నట్టు మరిచిపోయాం



కాంప్లెక్స్ ఉన్న సంగతి చాలా మంది మర్చిపోయారు. ఎక్కడికి వెళ్లాలన్నా జంక్షన్‌లోకి వెళ్లి బస్సు షెల్టర్‌లో నిలబడడం అలవాటు అయిపోయింది. ఇది కేవలం అధికారులు నిర్లక్ష్యమే. వర్షాలు, ఎండాకాలంలో మాత్రం పిల్లలతో షెల్టర్‌లో నిరీక్షించే వారు అవస్థలు పడుతున్నారు.
–డి. దీపిక, కణితి కాలనీ

అధికారులు స్పందించాలి



ముఖ్యకూడలిలో అతిపెద్ద కాంప్లెక్స్ ఉన్నప్పటికీ నిరుపయోగంగా ఉండడం దారుణం. లక్షలాదిరూపాయల వ్యయంతో నిర్మించిన కాంప్లెక్స్‌ను అధికారులు ఎందుకు పట్టించుకోవడంలేదో అర్థం కావడంలేదు. భవనాలను ఆధునికీకరించి బస్సులు కాంప్లెక్స్‌లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి.
–పోలవరపు గోవింద, అప్పికొండకాలనీ

దూర ప్రాంత సర్వీసులు వస్తేనే..



కూర్మన్నపాలెం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను వినియోగంలోకి తీసుకువస్తే ఈ ప్రాంతానికి ఎంతో మేలు జరుగుతుంది. దూర ప్రాంతాలకు వెళ్లే వారు బస్సుకోసం రోడ్డు పైనే వేచి ఉండాల్సి వస్తుంది. ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు.
– మహ్మద్ మొహీద్దీన్, కూర్మన్నపాలెం

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



మాట్లాడుతున్న హెచ్ఎం కాంతం

అక్కిరెడ్డిపాలెం: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం అన్నారు. శనివారం పాఠశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్రా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యుత్ వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతుల్లో పారవేయాలన్నారు. స్వచ్ఛ భారత్‌పై విద్యార్థులచే ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. ఉపాధ్యాయులు కుమారస్వామి, పీడీ ఇస్మాయిల్, పీఎంసీ చైర్మన్ కనకారావు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న సీఐ కేశవరావు తదితరులు

ఉక్కునగరం: త్రైత సిద్ధాంత తెలుగు ఉగాది క్యాలెండర్‌ను శనివారం ఆవిష్కరించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఐ కేశవరావు క్యాలెండర్‌ను విడుదల చేసి సిబ్బందికి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తెలుగు నెలలు అనుసరించడానికి వీలుగా తెలుగు తిథులతో ఆంగ్ల తేదీలను పొందుపరిచి క్యాలెండర్ తయారు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక విశాఖ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాగమణి, కన్యక పాల్గొన్నారు.

లభించని గల్లంతైన విద్యార్థి ఆచూకీ



సముద్రంలో గాలిస్తున్న నేవీ సబ్బంది, న్యూపోర్టు పోలీసులు

పెదగంట్యాడ: పాత గంగవరం తీరంలో గురువారం గల్లంతైన విద్యార్థి ఒనుం తనూష్(15) ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ కామేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ న్యూపోర్టు పోలీసులు, కోస్టుగార్డు సిబ్బందితో పాటు నేవీ సబ్బంది సోనాబోట్ సహాయంతో సముద్రంలో గాలించినా ఫలితం లేకపోయిందన్నారు. ఆదివారం మరోసారి గాలింపు చర్యలు చేపడతామని సీఐ తెలిపారు.

ఘనంగా ప్రపంచ ధరిత్రి దినోత్సవం



ధరిత్రి దినోత్సవంలో పాల్గొన్న పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉక్కునగరం: స్థానిక సెక్టార్–11 సృష్టి వరల్డ్ పాఠశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, తమ తల్లిదండ్రులతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పాఠశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ మేఘన కంభం మాట్లాడుతూ చిన్న వయసులో పిల్లల అభివృద్ధి అవసరాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవడం ఎంత అవసరమో చెప్పారు. పాఠశాల డైరెక్టర్ పి. సుశీలా రాణి మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంతలు.. అవస్థలు



వంతెన మధ్యలో రబ్బరు తేలిపోయి ఇలా..



వంతెనపై ఇనుప చువ్వలు కనపడకుండా మట్టితో పూడ్చిన దృశ్యం

అగనంపూడి: దువ్వాడ రైల్వే క్రాసింగ్, వీఎస్ఈజెడ్‌లను అనుసంధానం చేసే ఫ్లైఓవర్‌పై గుంతలు ప్రమాదకరంగా మారాయి. శ్లాబ్ రాడ్‌లు పైకి తేలేలా గోతులు ఏర్పడడం, ఖాళీల మధ్య ఏర్పాటు చేసిన ఇనుప ప్లేట్లు, వాటిపై అమర్చిన రబ్బరు పైకి తేలిపోవడంతో ద్విచక్రవాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇనుప చువ్వలు పైకి తేలడంతో ప్రయాణికులే గోతుల్లో మట్టితో పూడ్చారు. అలాగే భారీ వాహనాలు వంతెన పైనుంచి రాకపోకలు సాగిస్తున్న సమయంలో వంతెన ఊగుతున్నట్టు అనిపిస్తుండడంతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఎప్పటికప్పుడు ఇలాంటి పరిస్థితి తలెత్తుతున్నా సకాలంలో గోతులను పూడ్చడం లేదు. వంతెనపై ఎయిర్ క్రాక్‌లు రాకుండా ఉండేలా ఉంచిన ఖాళీల్లో ఇనుప ప్లేట్లు తుప్పుపట్టడంతో ఏడాది కిందట మార్చారు. అవి కూడా కొద్దిరోజుల్లోనే పైకి తేలే పరిస్థితి ఏర్పడడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంతెనపై ఏర్పడి గోతులను వెంటనే పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

• అల్లుకున్న నిర్లక్ష్యం



ఇటీవల విశాఖ డెయిరీ జంక్షన్‌లో తుప్పపట్టిన విద్యుత్ స్తంభం పడి వ్యక్తి దుర్మరణం చెందిన విషయం విధితమే. ఇలాంటి స్తంభాలు పలు చోట్ల ఉండడంతో వాహనచోదకులు వాటి పక్క నుంచి వెళ్లాలంటే భయాందోళనకు గురవుతున్నారు. ఎయిర్ పోర్టు నుంచి షీలానగర్ వచ్చే మార్గంలో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభానికి పాదలు అల్లుకోవడంతో పాటు తుప్ప పట్టి ఉంది. అది ఎప్పుడు కూలిపోతుందో అని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి పాదలతో ఉన్న విద్యుత్ స్తంభాలు షీలానగర్ నుంచి ఎయిర్ పోర్టు మధ్య చాలా ఉన్నాయి. ప్రమాదాలు జరగక ముందే వీటిని గుర్తించి తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు.

– అక్కిరెడ్డిపాలెం

ఈ వేస్ట్‌ను రీసైకిల్ చేయకపోతే అనారోగ్య సమస్యలు

- కలెక్టర్ హరేంధిర ప్రసాద్
- ఇక ప్రతి బుధవారం ఈ వేస్ట్ సేకరణ
- గాజువాకలో ఈ వేస్ట్ లోగో ఆవిష్కరణ



ఈవేస్ట్ లోగోను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

గాజువాక: స్వచ్ఛాంధ్రప్రదేశ్, స్వర్ణాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా విశాఖ నగరంలో ప్రతి బుధవారం ఈ వేస్ట్ సేకరణను ప్రారంభించనున్నామని జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంపై గాజువాకలో శనివారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఈ వేస్ట్ సేకరణ లోగో, ఈ వేస్ట్ సేకరణ డబ్బాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెడ్, మెర్క్యురీ, కాడ్మియం వంటి విష పదార్థాలు నేలలోకి, నీటిలోకి చేరి పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయన్నారు. వాటి వల్ల పలురకాల ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. దీనిపై అప్రమత్తం కాకపోతే హానికరమైన వాయువులు విడుదలవుతాయని, శ్వాసకోశ సమస్యలు, చర్మ సమస్యలు, క్యాన్సర్ వంటి రోగాలను కలిగిస్తాయని అన్నారు. పాత ఎలక్ట్రానిక్స్‌లో బంగారం, వెండి, కాపర్ వంటి విలువైన లోహాలు ఉంటాయని, వాటిని రీసైకిల్ చేయకపోతే వృథా అవుతాయన్నారు. ఈ వేస్ట్‌ను రీసైకిల్ చేయడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని అన్నారు. రీసైక్లింగ్ పరిశ్రమలో సేకరణ, వేరు చేయడం, మరమ్మతు వంటి పనుల్లో కొత్త ఉపాధి అవకాశాలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరేష్ కుమార్, గాజువాక జోనల్ కమిషనర్ బి.ఆర్.ఎస్.శేషాద్రి, ఎస్ఈ గోవిందరావు, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఏ, వీవోఏ ప్రతినిధులు, మొబైల్, ఎలక్ట్రానిక్స్ దుకాణదారులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న సీపీ బాగ్చి. చిత్రంలో డాక్టర్ సీతా మాణిక్యం

మహారాణిపేట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చి అన్నారు. శనివారం ఆంధ్రా విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మహిళలపై జరిగే సైబర్ నేరాలపై ప్రసంగించారు. సైబర్ నేరాలు జరుగుతున్న విధానం, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలిపారు. డాక్టర్ అంబేడ్కర్ లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.రాఘవయ్య, ప్రొఫెసర్ వి.రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ ఎ.పద్మావతి, ప్రొఫెసర్ ఎస్.బి. చంద్రకళ, డాక్టర్ కె.పల్లవి, న్యాయ, సిట్ విభాగాల నుంచి అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా గౌతు లచ్చన్న వర్ధంతి



గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతలపూడి



లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బొడ్డ గోవింద్ తదితరులు

కూర్మన్నపాలెం: సర్దార్ గౌతు లచ్చన్న వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. 87వ వార్డు శెట్టి బలిజ సేవా సంఘం ఆధ్వర్యంలో కణితిలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య హాజరై లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొని ఉత్తరాంధ్రకే పేరు ప్రఖ్యాతులు తెచ్చిన వ్యక్తి గౌతు లచ్చన్న అని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రగడ వేణుబాబు,దామోదర్, దానప్పలు, డి.గోవిందరాజులు, నాగేశ్వరరావు, పోతల కృష్ణ,నూకరాజు,రాంబాబు పాల్గొన్నారు.

- 86వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు బొడ్డ గోవింద్ పాల్గొని గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటరమణ, ఆదారి శ్రీను, నూకరాజు,సన్యాసిరావు,సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం ఓడింది..

అగనంపూడి: బెదిరింపులు, కుట్రలతో మేయర్ పదవిని కూటమి ప్రభుత్వం దక్కించుకుందని, ఆ పార్టీ నేతల చర్యలతో ప్రజాస్వామ్యం ఓడిందని ఆంధ్రప్రదేశ్ యాదవ హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడు యలమంచిలి అప్పారావు, సలహాదారులు గొలగాని సత్యనారాయణ, నమ్మి ప్రసాద్ అన్నారు. అగనంపూడిలో శనివారం వారు మాట్లాడారు. బీసీ మహిళ మేయర్‌గా ఉండడాన్ని సహించలేని కూటమి ప్రభుత్వ పెద్దలు.. తమకు బీసీల పట్ల ఎంత ప్రేమ ఉందో తెలియజేశారన్నారు. ఈ సంఘటనతో బీసీలకు కనువిప్పు కావాలన్నారు.

వ్యర్థాలతో అనర్థాలు



ర్యాలీని ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ భారతి

అగనంపూడి: వ్యర్థాల వల్ల అనేక అనర్థాలు వస్తాయని.. ఇంట్లో , కార్యాలయాల్లో వ్యర్థాలు ఉంచకూడదని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి అన్నారు. స్వర్ణాంధ్ర –స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించి మాట్లాడారు. మనిషి వ్యక్తిగత పరిశుభ్రతకు ఇస్తున్న ప్రాధాన్యం, పరిసరాలు, ఇళ్ల పరిశుభ్రతకు ఇవ్వక పోవడం వల్ల అనేక అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువుల్లో పాదరం, సీసం కాల్షియమ్, బ్రోమినేటెడ్ జ్వాల నిరోధకాలు వంటి హానికరమైన మూలకాలు ఉంటాయన్నారు. వీటిని రీసైక్లింగ్‌కు వినియోగిస్తే మంచిదన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ ఉష, నర్సింగ్ సూపరింటెండెంట్ హేమలక్ష్మి, పరిపాలనాధికారి రవిరాజ్, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

- దువ్వాడలోని విజ్ఞాన్ ఫార్మా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఈ వ్యర్థాల వల్ల తలెత్తే ఇబ్బందులపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. రీసైక్లింగ్ విధానం గురించి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పీవో సత్యలక్ష్మి పాల్గొన్నారు.